రావణకాష్టంలా మణిపూర్

- ఏడాదిన్నరగా రగులుతున్న ఈశాన్య రాష్ట్రం
- ఒక్కసారీ పర్యటించని ప్రధాని నరేంద్ర మోదీ
- తాజా హింసతో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు
- సీఎం, ప్రజాప్రతినిధుల ఇండ్లపై నిరసనకారుల దాడి
- ఇంఫాల్‌లో కర్ఫ్యూ.. 7 జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్
- మంత్రులు, ఎమ్మెల్యేల రాజీనామా యోచన
- బీజేపీ సర్కారుకు మద్దతు ఉపసంహరణ: ఎన్పీపీ

ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో కాలిపోతున్న ఓ బీజేపీ ఎమ్మెల్యే వాహనాలు

ఇంఫాల్, నవంబర్ 17: ఈశాన్య రాష్ట్రం మణిపూర్ రావణకాష్టంలా రగులుతున్నది. జాతుల మధ్య వైరంతో ఏడాదిన్నరగా అట్టుడుకుతున్నది. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హింసాత్మక ఘటనలతో రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉంటే.. ప్రధాని మాత్రం విదేశీ పర్యటనల్లో ఉన్నారని విపక్షాలు మండిపడుతున్నాయి. ఇప్పటివరకూ రాష్ట్రంలో కనీసం ఒక్కసారి కూడా ప్రధాని పర్యటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మణిపూర్‌పై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఇది తేటతెల్లం చేస్తున్నదని ఆరోపిస్తున్నాయి.

ప్రజాప్రతినిధుల ఇళ్లపై దాడులు

మిలిటెంట్లు బందీలుగా పట్టుకుపోయిన ఆరుగురు మైతీలు మృతదేహాలుగా నదిలో తేలడంతో మణిపూర్‌లో మళ్లీ తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఆగ్రహంతో ఉన్న బాధితులు శనివారం మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లు, ఆస్తులపై దాడి చేశాయి. ఒక మూక తీవ్ర ఆగ్రహంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్, మంత్రులు సపం రంజన్, ఎల్ సుసీంద్రో సింగ్, వై కఖేంచంద్‌లతో పాటు బీజేపీ ఎమ్మెల్యేలు సపమ్ కుంజాకెసోర్, జోయ్‌కిషన్ సింగ్, మరికొందరి ప్రజాప్రతినిధుల ఇళ్లపై దాడులు చేశారు. ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఇంఫాల్‌లో నిరవధిక కర్ఫ్యూను విధించింది. ఏడు జిల్లాల్లో మొబైల్ సర్వీస్‌లు, ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది. టీ రబీంద్రో, టీహెచ్ రాధే శ్యామ్, పావోనమ్ బ్రాజెన్‌లు రాజీనామా చేస్తారని ప్రచారం జరుగుతున్నది. అలాగే తనతో పాటు మిగిలిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా రాజీనామా చేస్తారని ఆ పార్టీ ఎమ్మెల్యే కీషామ్ మేఘచంద్ర ఆదివారం తెలిపారు.

24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేయాలి

ఆరుగురిని హతమార్చిన నిందితులను 24 గంటల్లో పట్టుకోవాలని ఆందోళనకారులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసనను విరమించబోమని స్పష్టం చేశారు. మిలిటెంట్లపై తక్షణం మిలటరీ చర్య చేపట్టాలని కో-ఆర్డినేటింగ్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటిగ్రిటీ (సీఓసీఓఎంఐ) డిమాండ్ చేసింది. అలాగే బాధిత ప్రాంతాల్లో భద్రతా, ప్రత్యేక బలగాలను ఉపసంహరించాలని కోరింది. కాగా, కేంద్రం ప్రకటించిన ఆరు కల్లోలిత ప్రాంతాల్లో అమలు చేస్తున్న ఆర్మ్‌డ్ స్పెషల్ ఫోర్సెస్ చట్టాన్ని ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా విజ్ఞప్తి చేసింది. కాగా, మణిపూర్‌లో హింసపై కేంద్ర మంత్రి అమిత్ షా ఢిల్లీలో ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలో నిర్వహించాల్సిన సభలను ఆయన రద్దు చేసుకున్నారు.

హింసకు ఆజ్యం పోస్తున్న బీజేపీ

ఉద్దేశపూర్వకంగానే అధికార బీజేపీ మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులకు ఆజ్యం పోస్తున్నదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 'గత ఏడాది మే నుంచి మణిపూర్ రాష్ట్రం ఊహించని బాధను అనుభవిస్తున్నది. రాష్ట్రంలోని పరిస్థితులకు పూర్తి బాధ్యత వహించి చక్కదిద్దాల్సిన ప్రభుత్వం విద్వేష, విభజన రాజకీయాలతో ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో హింసను రావణకాష్టంలా రగిలిస్తున్నది' అని ఎక్స్‌లో విమర్శించారు. నవంబర్ 7 నుంచి అక్కడ 17 మంది మరణించారని, ఇప్పుడు హింస కొన్ని కొత్త జిల్లాలకు కూడా వ్యాపించిందని, తర్వాత అది మిగిలిన ఈశాన్య రాష్ట్రాలకు కూడా పాకే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

బీరేన్ ప్రభుత్వానికి ఎన్‌పీపీ మద్దతు ఉపసంహరణ

మణిపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న క్రమంలో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ఆదివారం బీజేపీ నేతృత్వంలోని బీరేన్ సింగ్ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుంది. దీంతో ఎన్డీఏ కూటమి బలం అసెంబ్లీలో 53 నుంచి 46కు పడిపోయింది. 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో ప్రస్తుతం విపక్షాలకు ఏడు సీట్లు మాత్రమే ఉన్నాయి. అందులో కాంగ్రెస్‌కు 5, కుకీ పీపుల్స్ అలయెన్స్‌కు 2 ఉన్నాయి. బీజేపీకి ప్రస్తుతం 37 స్థానాలు ఉండగా, అందులో 19 మంది సభ్యులు పార్టీ అసమ్మతివాదులుగా ఉన్నారు. వారు బీరేన్ సింగ్‌ను నిశితంగా విమర్శిస్తున్నారు. బీరేన్ సింగ్‌కు గరిష్ఠంగా 20 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉందని, ఆయన పదవికి ప్రమాదం పొంచి ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

విశ్వ సుందరిగా డెన్మార్క్ భామ

విక్టోరియా కెజార్‌ను వరించిన కిరీటం ■ ఆ దేశానికి ఇదే తొలిసారి

న్యూఢిల్లీ, నవంబర్ 17: డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్(21) ఈ ఏడాది విశ్వ సుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. ఈ అంతర్జాతీయ అందాల పోటీలో తన దేశానికి మొదటిసారి విజయాన్ని అందించారు. శనివారం రాత్రి మెక్సికోలోని అరెనా నగరంలో జరిగిన విశ్వ సుందరి 73వ ఎడిషన్‌లో 120 మందికి పైగా అందగత్తెలు పోటీపడ్డారు. మిస్ నైజీరియా చిడిమ్మ అడెట్స్‌హినా రెండో స్థానంలో, మిస్ మెక్సికో మరియా ఫెర్నాండా బెల్ట్రాన్ మూడో స్థానంలో నిలిచారు. 'ఒక కొత్త శకం ప్రారంభమైంది! డెన్మార్క్‌కు, మన 73వ విశ్వ సుందరికి అభినందనలు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తి, సాధికారత కలిగించేలా మీ ప్రయాణం సాగాలని కోరుకుంటున్నాం.#73వ విశ్వ సుందరి పోటీలు' అని మిస్ యూనివర్స్ అధికార ఇన్‌స్టాగ్రామ్ పేజీ పోస్ట్ పేర్కొంది. విక్టోరియా జంతు సంరక్షణ కార్యకర్తగా, వజ్రాల వ్యాపారంలో ఉద్యోగిగా ఉన్నారు. ఈ పోటీలో భారత సుందరి రియా సింఘా టాప్-30 లిస్ట్‌లో నిలిచారు.

దీర్ఘశ్రేణి హైపర్‌సానిక్ క్షిపణి పరీక్ష సక్సెస్

తొలిసారి పరీక్షించిన భారత్

ఈ సాంకేతికత కలిగిన అతికొద్ది దేశాల సరసన చేరిక



న్యూఢిల్లీ, నవంబర్ 17: దీర్ఘ శ్రేణి హైపర్‌సానిక్ క్షిపణి పరీక్షను భారత్ తొలిసారి ఆదివారం విజయవంతంగా పరీక్షించింది. తద్వారా ఈ సాంకేతికత కలిగిన అతికొద్ది దేశాల సరసన నిలిచింది. గగనతల రక్షణ వ్యవస్థలను దాటుకొని అత్యంత వేగంతో లక్ష్యాలను ఛేదించగలగడం ఈ క్షిపణి ప్రత్యేకత. ఒడిశా తీర ప్రాంతంలో చేపట్టిన లాంగ్‌రేంజ్ 'హైపర్‌సానిక్' క్షిపణి టెస్ట్ ఫ్లైట్ సక్సెస్ అయ్యిందని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆదివారం ప్రకటించారు. మిస్సైల్‌ను అభివృద్ధి చేసిన డీఆర్‌డీవో సైంటిస్టులను అభినందించారు. ఈ విజయం అత్యంత క్లిష్టమైన, అధునాతన మిలటరీ టెక్నాలజీ కలిగిన దేశాల సరసన భారత్‌ను నిలిపిందని అన్నారు. అణ్వాయుధాల్ని, శక్తివంతమైన బాంబుల్ని ఈ మిస్సైల్స్‌తో ప్రయోగిస్తారు. ఈ క్షిపణిని హైదరాబాద్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మిస్సైల్ కాంప్లెక్స్‌లో రూపొందించారు. హైపర్‌సానిక్ క్షిపణులు ధ్వని వేగం (మ్యాక్ 5-గంటకు 1,220 కిలోమీటర్లు) కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణించగలవు. అంటే గంటకు 6,250 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలవు. కొన్ని అడ్వాన్స్‌డ్ క్షిపణులు గంటకు 24,140 కిలోమీటర్ల వేగంతోనూ ప్రయాణించగలవు. అంత మెరుపువేగంలో కూడా ఇవి శత్రు రాడార్‌లు, గగనతల రక్షణ వ్యవస్థలకు దొరక్కుండా దిశను మార్చుకోగలవు.

న్యూజిలాండ్‌లో 'ఖలిస్థాన్' రిఫరెండం

ఆక్లాండ్, నవంబర్ 17: కెనడాలో రెచ్చిపోతున్న ఖలిస్థాన్ వేర్పాటువాదులు, మద్దతుదారులు.. ఇప్పుడు న్యూజిలాండ్‌లోనూ భారత్‌ను టార్గెట్ చేశారు. ఆదివారం ఆక్లాండ్ నగరంలో ఖలిస్థాన్ ఏర్పాటుపై 'రిఫరెండం'ను నిర్వహించటం సంచలనం రేపింది. వివాదాస్పద 'రిఫరెండం'కు న్యూజిలాండ్ ప్రభుత్వం అనుమతి ఇవ్వటంపై ఆ దేశంలోని ప్రవాస భారతీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'సిక్స్ ఫర్ జస్టిస్' నేతృత్వం వహించిన ఈ రిఫరెండానికి న్యూజిలాండ్ అనుమతులు ఇవ్వటం పలు అనుమానాలకు దారితీసింది. దీనిపై ఆక్లాండ్‌లోని ప్రభుత్వ యంత్రాంగం స్పందిస్తూ, న్యూజిలాండ్ భావ ప్రకటనా స్వేచ్ఛకు కట్టుబడిన దేశంగా పేర్కొన్నది.

100 మందికి పైగా విదేశీయులకు ఉరి

ఈ ఏడాది మరణశిక్ష అమలు చేసిన సౌదీ

దుబాయ్: సౌదీ అరేబియా ఈ ఏడాది 100 మందికి పైగా విదేశీయులను వివిధ నేరాల కింద ఉరి తీసినట్టు ఏఎఫ్‌పీ హక్కుల సంస్థ వెల్లడించింది. గత రెండేళ్ల కంటే ఈ సంఖ్య మూడు రెట్లు ఎక్కువని పేర్కొంది. తాజాగా నాజ్రాన్‌లోని ఈశాన్య ప్రాంతంలో యెమెన్ దేశానికి చెందిన ఒక వ్యక్తిని డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులో ఉరి తీసినట్టు సౌదీ మీడియా తెలిపింది. దీంతో ఈ ఏడాది దేశంలో ఉరితీసిన విదేశీయుల సంఖ్య 101కు చేరింది. 2022, 2023 సంవత్సరాలలో ప్రతి ఏడాది 34 మందిని వివిధ నేరాల కింద ఉరితీశారు. అయితే ఈ ఏడాది ఈ సంఖ్య అనూహ్యంగా మూడు రెట్లు అధికంగా నమోదైంది.

చెప్పులు ధరించడంపై నిషేధం విధించండి

స్వతంత్ర అభ్యర్థి డిమాండ్

ముంబై: పోలింగ్ బూత్‌లకు 200 మీటర్ల పరిధిలో ఓటర్లు, అభ్యర్థులు, పోలింగ్ అధికారులు చెప్పులు ధరించడంపై నిషేధం విధించాలని ఓ అభ్యర్థి డిమాండ్ చేశారు. ఈ నిబంధనను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో పరంద నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న గురుదాస్ శంభాజీ ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. తన ఎన్నికల గుర్తు 'చెప్పులు' అని, వీటిని ధరించడం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమవుతుందని తెలిపారు. ఈసీ నియమావళి ప్రకారం, అభ్యర్థులు ఎన్నికల గుర్తులను పోలింగ్ బూత్‌ల వద్ద ప్రదర్శించరాదన్నారు.

ఈవీ బ్యాటరీల్లో మంటలను ముందే గుర్తించొచ్చు!

ఏఐ సాంకేతికతను అభివృద్ధి చేసిన పరిశోధకులు

న్యూఢిల్లీ: లిథియం-అయాన్ బ్యాటరీల్లో రేగే మంటలను ముందుగానే గుర్తించే కృత్రిమ మేధ సాంకేతికతను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. బ్యాటరీల్లో ఏర్పడిన రసాయనిక ప్రతిస్పందన మంటలకు కారణమవుతుందని, అయితే చాలా బ్యాటరీలకు గట్టి తొడుగులు కలిగిన రక్షణ వాల్వ్ ఉండటం వల్ల అది విస్తరించలేవని పేర్కొన్నారు. ఈ రక్షణ వాల్వ్ విరిగినప్పుడు సోడా సీసా తెరచిన మాదిరి శబ్దం వస్తుందని తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌కు బ్యాటరీల రక్షణ వాల్వ్ విరిగిన శబ్దాన్ని గుర్తించే శిక్షణను ఇచ్చారు. విపరీతంగా వేడెక్కిన బ్యాటరీ శబ్దాన్ని కెమెరా, మైక్రోఫోన్ సాయంతో 94 శాతం కచ్చితత్వంతో ఈ అల్గారిథమ్ గుర్తిస్తుందని పరిశోధకులు వెల్లడించారు.

మోదీకి ప్రతిష్ఠాత్మక నైజీరియా పురస్కారం

అబుజ (నైజీరియా): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని నైజీరియా తన రెండో అత్యున్నత జాతీయ పురస్కారం 'ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది నైగర్'తో సత్కరించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, ఈ పురస్కారాన్ని అత్యంత వినమ్రతతో స్వీకరిస్తున్నానని చెప్పారు. దీనిని భారత ప్రజలకు అంకితం చేస్తున్నట్టు తెలిపారు. ఈ విశిష్ట పురస్కారాన్ని స్వీకరించిన రెండో విదేశీ నేత ఆయన. 1969లో క్వీన్ ఎలిజబెత్‌ను ఈ అవార్డుతో నైజీరియా గౌరవించింది. మోదీకి లభించిన ఇటువంటి విదేశీ పురస్కారాల్లో ఇది 17వది.

విదేశీ ఆస్తులు వెల్లడించకపోతే 10 లక్షల జరిమానా

పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ, నవంబర్ 17: ఆదాయ పన్ను రిటర్న్(ఐటీఆర్)లో విదేశీ ఆస్తులు, విదేశాల నుంచి వచ్చే ఆదాయాన్ని వెల్లడించకపోతే నల్ల ధన వ్యతిరేక చట్టం కింద రూ.10 లక్షలు జరిమానా విధిస్తామని ఆదాయ పన్ను శాఖ ఆదివారం హెచ్చరించింది. భారత్‌లో నివసించే పన్ను చెల్లింపుదారులు గతేడాది విదేశీ ఆస్తులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, బీమా ఒప్పందాలు, వార్షిక ఒప్పందాల నగదు విలువ, వ్యాపారం లేదా వ్యాపార సంస్థల్లోని ఆర్థిక ప్రయోజనాలు, స్థిరాస్తులు, కస్టోడియన్ అకౌంట్, ఈక్విటీ(షేర్లు), రుణాల వడ్డీ, ట్రస్ట్‌లకు ట్రస్టీగా ఉన్న వివరాలు, ట్రస్ట్ స్థాపించిన వారి నుంచి పొందిన లబ్ధి, బ్యాంక్ ఖాతాలకు సంతకం చేసే అధికార వివరాలు, ఏవైనా పెట్టుబడి ఆస్తులను ఐటీఆర్‌లో పేర్కొనాలి. వారు తప్పనిసరిగా విదేశీ ఆస్తులను లేదా విదేశీ ఆదాయ మార్గాలను తమ ఐటీఆర్‌లో వెల్లడించాలి. సవరించిన ఐటీఆర్ సమర్పించడానికి డిసెంబర్ 31 ఆఖరు తేదీ.

లాభదాయక పదవుల్లో ఉన్న ఎంపీలపై

అనర్హత వేటుకు త్వరలో కొత్త చట్టం

న్యూఢిల్లీ, నవంబర్ 17: లాభదాయక పదవుల్లో కొనసాగుతున్న పార్లమెంట్ సభ్యులపై అనర్హత వేటు వేసేందుకు 65 ఏండ్ల క్రితం తీసుకొచ్చిన పాత చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నది. దాని స్థానంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా త్వరలో కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తున్నది. దీనిలో భాగంగా కేంద్ర న్యాయశాఖ ఆధ్వర్యంలోని శాసన విభాగం 16వ లోక్‌సభలో కల్రాజ్ మిశ్రా నేతృత్వంలోని జేసీపీవో (జాయింట్ కమిటీ ఆన్ ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్) చేసిన సిఫారసులకు అనుగుణంగా 'పార్లమెంట్ (అనర్హత నిరోధక) బిల్లు-2024' ముసాయిదాను రూపొందించింది. ఇది కార్యరూపం దాల్చితే స్వచ్ఛ భారత్ మిషన్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ్-గ్రామీణ్ కౌశల్ యోజన లాంటి పథకాలకు నామినేట్ అయిన ఎంపీలకు అనర్హత వేటు నుంచి రక్షణ లభిస్తుంది.

భారతీయులకు వీసాల కుదింపు

- భారీగా తగ్గించిన కెనడా
- గతంలో దాదాపు 80% మందికి పర్యాటక వీసాలు
- ప్రస్తుతం 20% కంటే దిగువకు పడిపోయిన సక్సెస్ రేటు
- తిరస్కరణకు గురౌతున్న దరఖాస్తుల్లో పంజాబీలవే అధికం

జలంధర్, నవంబర్ 17: భారతీయులకు జారీచేసే పర్యాటక వీసాల సంఖ్యను కెనడా భారీగా కుదించింది. గతంలో కెనడా పర్యాటక వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి 100 మంది భారతీయుల్లో దాదాపు 80 మందికి ఆ వీసాలు లభించేవి. కానీ, ఇప్పుడు ఆ సక్సెస్ రేటు 20% కంటే దిగువకు పడిపోయింది. ముఖ్యంగా పంజాబ్ నుంచి పర్యాటక వీసాల కోసం వచ్చే దరఖాస్తులను కెనడా పెద్ద సంఖ్యలో తిరస్కరిస్తున్నది. గత కొన్ని నెలల నుంచి ఈ ధోరణి కనిపిస్తున్నది. అర్హత గల దరఖాస్తుదారులకు ఇచ్చే 10 ఏండ్ల ఆటోమ్యాటిక్ మల్టిపుల్-ఎంట్రీ టూరిస్ట్ వీసాలను నిలిపివేయడానికి కొన్ని నెలల ముందు నుంచి కెనడా ఈ ధోరణిని అవలంబిస్తున్నది. తద్వారా పర్యాటకులకు తీవ్ర అడ్డంకులు సృష్టిస్తున్నది. కెనడా ఇమ్మిగ్రేషన్ విధానాలు గణనీయంగా కఠినతరం అవుతున్నట్టు ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. వాస్తవానికి న్యూఢిల్లీ-ఒట్టావా మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పటికీ ఈ ఏడాది ప్రథమార్థం (జనవరి-జూలై)లో భారతీయులకు కెనడా ఇమ్మిగ్రేషన్, శరణార్థి, పౌరసత్వ విభాగం ఐఆర్‌సీసీ (ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా)3,65,750 పర్యాటక వీసాలను జారీ చేసింది. ఇవి నిరుడు ఇదే సమయంలో మంజూరైన వీసాల కంటే 20,119 అధికం. కానీ, ఆ తర్వాత ఈ ధోరణి తల్లకిందులైంది. ఈ ఏడాది జూలై-ఆగస్టు నుంచి భారతీయుల వీసా సక్సెస్ రేటు గణనీయంగా దిగజారింది.

ఆర్థిక కారణాలతో తిరస్కరణ

నిబంధనలు కఠినతరమవడంతో భారీగా ఆస్తులున్న సంపన్న కుటుంబాలతోపాటు అధిక వేతనాలు పొందే వృత్తి నిపుణులు, ప్రభుత్వ అధికారుల్లాంటి హై-ప్రొఫైల్ వ్యక్తుల నుంచి వచ్చే వీసా దరఖాస్తులను సైతం ఆర్థిక కారణాలతో తిరస్కరిస్తున్నారు. భారత్‌లో విలువైన ఆస్తులను కలిగి ఉండటంతోపాటు బ్యాంకులో పనిచేస్తూ అధిక వేతనాలను పొందుతున్న ఓ జంట కెనడాలో శాశ్వత నివాసిగా ఉంటున్న తమ కుమారుడిని సందర్శించేందుకు ఇటీవల చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, ఆర్థిక కారణాలతో వారి వీసా దరఖాస్తు సైతం తిరస్కరణకు గురైందని కెనడా ఇమ్మిగ్రేషన్ నిపుణుడు గురుప్రీత్ సింగ్ తెలిపారు.

దక్షిణ కొరియాపై 'సౌండ్ బాంబింగ్'

లౌడ్ స్పీకర్లతో హడలెత్తిస్తున్న కిమ్

సియోల్, నవంబర్ 17: దక్షిణ కొరియాలో సరిహద్దు గ్రామమైన డాంగ్సన్ ప్రజలు పొరుగుదేశం దాడులకు భీతావహులవుతున్నారు. ఇంతకీ వారు ఎదుర్కొంటున్నది తుపాకి దాడులో, బాంబు దాడులో కాదు. శబ్ద దాడులు. వినడానికి ఇది ఆశ్చర్యకరంగా ఉన్న పొరుగున ఉన్న ఉత్తర కొరియా నుంచి వస్తున్న అతి తీవ్ర శబ్దాలకు వీరి కర్ణభేరీలు పగిలిపోతున్నాయి. బాబోయ్ ఈ శబ్దం భరించలేం అంటూ ఇంటి తలుపులు తీసి బయటకు రావడానికే భయపడిపోతున్నారు. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం ఇటీవల అమెరికా, దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై ఆగ్రహంతో ఉన్న ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ 'సౌండ్ బాంబింగ్'తో వినూత్న తరహాలో దాడి చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా బాంబులు, మెటాలిక్ గ్రైండింగ్, ఫిరంగుల శబ్దాలను రికార్డు చేసి వాటిని భారీ లౌడ్‌స్పీకర్ల ద్వారా సరిహద్దు గ్రామమైన డాంగ్సన్ ప్రజలకు వినిపిస్తున్నారు. ఇటీవల చెత్త బెలూన్ల దాడితో హడలెత్తించిన కిమ్ ఈ విధంగా మరో దుష్ట సంప్రదాయానికి తెరతీశారు. ఈ భారీ శబ్దాలతో తాము ఈ ఏడాది జూలై నుంచి తీవ్ర నిద్రలేమితో పాటు తలనొప్పి, ఒత్తిడితో బాధపడుతున్నామని, తమ గ్రామంలోని జంతువులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వారు వాపోయారు. బాంబులు వేయకుండానే వారు విధ్వంసం సృష్టిస్తున్నారని ఒక గ్రామస్తుడు వాపోయాడు. తమ గ్రామంలో అతి తక్కువ మంది జనాభా ఉన్నారని, అందులో వృద్ధులు ఎక్కువగా ఉన్నారని, అందుకే తమ బాధను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించాడు.

ఆప్‌కు ఢిల్లీ మంత్రి కైలాశ్ రాజీనామా

- ఎన్నికల ముంగిట ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆప్ సీనియర్ నేత, రవాణా శాఖ మంత్రి కైలాశ్ గెహ్లాట్ ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ముఖ్యమంత్రి ఆతిశీ ఆమోదించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన పార్టీ సొంత రాజకీయ అజెండా కోసం పాకులాడుతున్నదని గెహ్లాట్ ఆరోపించారు. అయితే గెహ్లాట్ ప్రస్తుతం ఈడీ, సీబీఐ కేసులు ఎదుర్కొంటున్నారని, ఆప్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరడం తప్ప ఆయనకు మరో అవకాశం లేదని ఆప్ నేతలు వ్యాఖ్యానించారు.

బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఆప్‌లో చేరిక

ఒక పక్క మంత్రి పార్టీకి రాజీనామా చేయగా, మరో పక్క ఆప్‌లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా చేరారు. వాయువ్య ఢిల్లీ నియోజకవర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసిన ఆయన ఆదివారం కేజ్రీవాల్ సమక్షంలో ఆప్‌లో చేరారు. బీజేపీ అధిష్ఠానంపై భ్రమలు తొలిగాయని, అందుకే తాను ఆప్‌లో చేరినట్టు ఆయన తెలిపారు.

కాలుష్యం ఎఫెక్ట్.. ఢిల్లీలో స్కూళ్లు మూత

ట్రక్కుల ప్రవేశంపై నిషేధం

న్యూఢిల్లీ, నవంబర్ 17: దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత ప్రమాదకర స్థాయికి దిగజారింది. ఈ సీజన్‌లో తొలిసారిగా 'సివియర్ ప్లస్'కు చేరుకోవడంతో కాలుష్య నియంత్రణ మండలి నాలుగో దశ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ)ని అమలు చేస్తున్నట్టు ఆదివారం ప్రకటించింది. ఈ కాలుష్య నివారణ ప్రణాళిక సోమవారం *ఉదయం 8 గంటల* నుంచి అమలులోకి వస్తుంది. దీని ప్రకారం నగరం పరిధిలో ట్రక్కుల ప్రవేశంపై నిషేధాన్ని విధిస్తారు. అలాగే ప్రభుత్వ నిర్మాణాలను తాత్కాలికంగా నిలిపివేస్తారు. ఉద్యోగుల్లో సగం మంది మాత్రమే విధులకు హాజరవ్వాలని, మిగిలిన వారు వర్క్ ఫ్రం హోం చేయాలని అధికారులు ఆదేశించారు. *10, 12 తరగతులు* మినహా మిగిలిన తరగతులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

మహాయుతికి మరాఠ్వాడా పరీక్ష!

వ్యవసాయ సంక్షోభంతో ప్రభుత్వంపై రైతుల్లో ఆగ్రహం • రిజర్వేషన్లు ఇవ్వలేదని మరాఠా యువత మండిపాటు

ముంబై: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో విజయం కోసం మహాయుతి, ఎంవీఏ కూటముల పోరాటం తుది అంకానికి చేరుకుంది. ముఖ్యంగా మరాఠ్వాడాలో మహాయుతి కూటమికి పరీక్ష ఎదురుకానుంది. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడం, మరాఠా రిజర్వేషన్ల అంశం, ప్రాంతీయ పార్టీలను చీల్చడం వంటివి అధికార కూటమికి ప్రతికూలంగా మారాయి. అయితే లడ్కీ బహిన్ వంటి సంక్షేమ పథకాలు, అయోధ్య రామాలయం వంటివాటిపై సానుకూలత కనిపిస్తున్నది.

మరాఠా కోటా ప్రభావం

రాష్ట్ర జనాభాలో 28 శాతం ఉన్న మరాఠాలకు విద్య, ఉద్యోగాల్లో కోటా కోసం పోరాడుతున్న మనోజ్ జరాంగే పాటిల్ ఈ ప్రాంతానికి చెందినవారే. మరాఠా యువతలో ఆయనకు చెప్పుకోదగ్గ స్థాయిలో ఫాలోయింగ్ కనిపిస్తున్నది. బైక్‌లపై 'యోధ' పాటిల్ ఫొటోలతో కూడిన స్టిక్కర్లతో దూసుకెళ్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలో ఆయన స్పష్టంగా చెప్పలేదు. కానీ మరాఠాలకు రిజర్వేషన్లు ఇవ్వనివారిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. దీని ప్రభావం అధికార కూటమి బీజేపీ-శివసేన-ఎన్‌సీపీలపై ప్రతికూలంగా పడే అవకాశం ఉంది. ముఖ్యంగా మరాఠా యువతలో అధికార మహాయుతి కూటమిపై ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నది. అయితే, మరాఠా నేతలు అన్ని పార్టీల్లోనూ ఉన్నందువల్ల వీరి ఓట్లు చీలిపోయే అవకాశం ఉందని కొందరు చెప్తున్నారు.

రైతుల ఆగ్రహం

కరువు పీడిత ప్రాంతంలో పత్తి, సోయాబీన్ వంటి పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రస్తుత మహాయుతి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వీరు ప్రశంసిస్తున్నారు. మహిళలకు నగదు బదిలీ పథకం ప్రయోజనకరంగా ఉందంటున్నారు. ప్రైవేట్ ఉద్యోగి సునీల్ గైక్వాడ్ మాట్లాడుతూ, అయోధ్యలో రామాలయం నిర్మాణం, జమ్ము కశ్మీరుకు ప్రత్యేక హోదాను కల్పించిన అధికరణ 370 రద్దు వంటివాటివల్ల తాను బీజేపీకి గట్టి మద్దతుదారుగా మారానని చెప్పారు. అయితే, ఓ రైతుగా తాను చాలా ఇబ్బందులు పడుతున్నానన్నారు. సోయాబీన్‌కు లభించిన ధర చాలా తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాంతీయ పార్టీల చీలికలు

మరాఠ్వాడా ఓటర్లపై ప్రాంతీయ పార్టీల చీలికల ప్రభావం కూడా ఉంది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇష్టపడే రైతులు కూడా శివసేనను ఆయన చీల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. తాము సంప్రదాయబద్ధంగా శివసేన మద్దతుదారులమేనని, అయితే షిండే సొంతంగా వేరొక పార్టీని ఏర్పాటు చేసుకుని ఉండవలసిందని అంటున్నారు. అవిభాజ్య శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేపై తిరుగుబాటు చేయడాన్ని ఖండిస్తున్నారు. మరాఠ్వాడాలోని 46 శాసనసభ నియోజకవర్గాల్లో 16 స్థానాల చొప్పున షిండే నేతృత్వంలోని శివసేన, ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన (యూబీటీ) పోటీ చేస్తున్నాయి. ఈ రెండిటిలో ఏ పార్టీవైపు ఓటర్లు మొగ్గుచూపుతారనేదానిపై వాటి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

ఉక్రెయిన్ పవర్‌గ్రిడ్‌పై విరుచుకుపడ్డ రష్యా

120 మిస్సైళ్లు, 90 డ్రోన్లతో దాడి

కీవ్: ఉక్రెయిన్‌లో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలే లక్ష్యంగా రష్యా భీకరమైన బాంబు దాడులకు దిగింది. ఆదివారం రాజధాని కీవ్ సహ దేశంలోని పలు చోట్ల ఉన్న మౌలిక వసతుల కేంద్రాలను రష్యా మిలటరీ టార్గెట్ చేసింది. కీవ్, ఒడిస్సీ, సెంట్రల్ ఉక్రెయిన్‌ల్లోని వివిధ ప్రాంతాలపై వందల కొద్దీ మిస్సైల్స్, డ్రోన్లతో పెద్ద ఎత్తున బాంబు దాడులను చేపట్టింది. ఉక్రెయిన్ మౌలిక వసతులను ధ్వంసం చేయటం, సామాన్యులను చంపటమే రష్యా లక్ష్యంగా పెట్టుకుందని జెలెన్‌స్కీ ఆరోపించారు. 120కిపైగా మిస్సైల్స్, 90 డ్రోన్లను ప్రయోగించినట్టు తెలిపారు. ఉక్రెయిన్ నగరం మైకోలైవ్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్ ధ్వంసమైందని, డ్రోన్ దాడిలో ఇద్దరు చనిపోగా, ఇద్దరు చిన్నారులు సహా మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని జెలెన్‌స్కీ చెప్పారు. రష్యా క్షిపణి, డ్రోన్ దాడుల్లో.. 140 వరకు తమ మిస్సైల్ రక్షణ వ్యవస్థ అడ్డుకుందని వివరించారు. డ్రోన్లు, మిస్సైల్స్‌ను రష్యా ఏకకాలంలో ప్రయోగించిందని, గత మూడు నెలల్లో రష్యా చేపట్టిన భీకరమైన బాంబు దాడులుగా కీవ్ సిటీ మిలటరీ వర్గాలు పేర్కొన్నాయి. రాబోయే శీతాకాలంలో ఉక్రెయిన్ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీయటమే లక్ష్యంగా రష్యా బాంబు దాడులు చేపడుతున్నట్టు ఉక్రెయిన్ అధికార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నెతన్యాహూ ఇంటి పైకి ఫ్లాష్ బాంబులు

ముగ్గురు నిందితుల అరెస్ట్

సిజేరియా, నవంబర్ 17: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఇంటిపై మరోసారి దాడి జరిగింది. శనివారం రెండు ఫ్లాష్ బాంబులు ఆయన ఇంటివద్ద పడ్డాయని, అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తు, నిందితుల వివరాలను 30 రోజుల పాటు ప్రచురించవద్దని కోర్ట్ గ్యాగ్ ఉత్తర్వులు జారీ చేసింది. నెతన్యాహూ ఇంటిపై బాంబులతో దాడి చేయడం అంటే అన్ని హద్దులను దాటడమేనని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గత నెలలోనూ నెతన్యాహూ ఇంటిపై డ్రోన్ దాడి జరిగింది.



ఇరాన్ తదుపరి నేతగా ఖమేనీ తనయుడు!

టెహ్రాన్: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (85) రెండో కుమారుడు మొజ్తబా ఖమేనీ ఆ దేశ తదుపరి నేతగా ఎన్నికయ్యారు. అయతుల్లా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు, మరణానికి ముందే పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు మీడియా కథనాలను బట్టి తెలుస్తున్నది. మరో వైపు, మొజ్తబా తన తండ్రి జీవించి ఉండగానే ఇరాన్ సుప్రీం లీడర్ పదవిని చేపట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయతొల్లా డిమాండ్ మేరకు సెప్టెంబరు 26న ఇరాన్ నిపుణుల సభ సమావేశమైంది. తన వారసుని ఎన్నికను అత్యంత రహస్యంగా ఉంచాలని సభ్యులకు అయతుల్లా నుంచి ఆదేశాలు వెళ్లాయని సమాచారం.